# సంపాదకీయము

125 సంవత్సరములక్రితము దివ్యత్వము పూజ్య లాలాజీ రూపముతో ఫతేఘడ్‌లో బసంత్ పంచమినాడు అవతరించింది. మానవ జీవితము యాంత్రిక మరియు సాంకేతిక ప్రగతికి అలవడుతున్నరోజులవి. విద్యుత్తు మరియు అణుశాస్త్రము ఇంకా విజృంభించని రోజులవి.

అయినా, దివ్యత్వమునకు తెలియనిది ఏముంటుంది? రాబోవు రోజులు మానవుణ్ణి ఎంతగా దిగజారుస్తుందో తెలిసి అట్టి దురవస్థనుంచి తప్పించడానికై మార్గాన్వేషణచేసి, ప్రాణాహుతియను దివ్యశక్తిని భగవంతునినుంచి సంపాదించి మానవకళ్యాణానికై వినియోగించిన పుణ్యమూర్తి సమర్థ గురువు పూజ్య లాలాజీ. తన జీవితమంతా మానవునిలో యున్న పాశవిక ప్రవృత్తులను ఎలా భగవత్ పరంగా మళ్ళించగలమో, మరియు యాతని ఆలోచనలు దైవీకం చెయ్యవచ్చో అనే అంశాలపై తన దృష్టిని మరల్చి తగువిధానాలను కనుగొని వాటిని మనకందించడానికై కృషిచేసిన మహనీయుడు ఆయన. అంతకంటే కూడ ఆయన తనని తాను తన ప్రియ శిష్యుడయిన మన బాబూజీలో ఐక్యమయి వినూత్న ఆధ్యాత్మిక అధ్యాయం
ప్రారంభంకావించారు. ఆ లయమే మనకు విశిష్టమూర్తిత్వాన్ని, మన పూజ్య బాబూజీగారిగా, భగవంతుడు ప్రసాదించడానికి తోడ్పడింది. ఇది ఆధ్యాత్మిక చరిత్రలో కనీ వినీ ఎరుగనిది. ఒక అవతారం యొక్క సమయము ముగియక మునుపే అంతటి మూర్తి ప్రభవించడము ఇంతకు ముందు ఎప్పుడూ జరుగలేదు. మానవుని దుర్గతి, పూజ్య లాలాజీ గారి అపార ప్రేమ, మన పూజ్య బాబూజీ గారి అంకిత భావము ఇట్టి అసాధ్యాన్ని కలుగచేసింది. పూజ్య లాలాజీ గారు బహు కష్టమయిన అష్టాంగయోగాన్ని మనందరికి వీలుపడేలా సులభతరంచేసి మనకు ఒక వినూత్న యోగ మార్గాన్ని పూజ్య బాబూజీ ద్వారా అందచేసారు. ఆత్మ, పరబ్రహ్మంలో లీనమవడం అంటే అదేదో సన్యాసులు, పరివ్రాజకులు చేసేపనియని, అది సంసారులకు వీలుపడదనే మూఢ నమ్మకాన్ని కాదని, అది ఎంత సులువో తెలియచేసే పద్ధతిని మనకు అనుగ్రహించారు. ఆత్మన్ యంటే మననంచేసే శక్తి కలిగియుండి కదలుతూయుండేదనియు, బ్రహ్మన్ యంటే మననంచేసే శక్తి కలిగియుండి పెరుగుతూయుండేదని విడమర్చి చెప్పి, దీనిని అందరూ సాధించగల సమర్థత కలిగియున్నారని చెప్పి మనందరినీ బ్రహ్మస్వరూపులుగా కమ్మని, ఇది మన జన్మహక్కనీ ప్రబోధించిన మహామనీషి పూజ్య లాలాజీ. మన స్వార్థానికి మూలపట్టయిన శారీరక సుఖములపట్ల కోరిక.
భౌతిక, ప్రాపంచిక విషయములందాసక్తి మున్నగు వాటినుండి విడివడలేనటువంటి మన

దౌర్భాగ్యపు స్థితి మనలను ఎట్లు అశక్తులుగావించుచున్నదో ఎరిగినవాడయిన ఆ మహానీయుడు, మనకు మన పూజ్య బాబూజీ గారిని, మనలను మన గమ్యం చేర్చేలా సర్వసమర్థునిగా మలచడానికై తన్ను ఆహుతి చేసికొన్న మహానీయుని జన్మదినం, బసంతపంచమి, సర్వమానవాళికి పర్వదినం. చిన్ననాడు విన్న పాట: ఎంతని పొగడుదు, ఏమని నుడువుదు, ఔరా ఈ వింతను కనుగొనగా ... వింతే మరి - - పశువుగాయున్న మనలను, మానవులుగా చేసి మనీషిగా చెయ్యగల పద్ధతి యుందంటే వింతే మరి. అది నిజమని అనుభవం ద్వారా మనకు తెలుసు. తెలిసినదానిని పంచుకోవడం ఎదిగినవారల నైజం.
సహనావవతు, సహనౌ భునక్తు ...

ఓం శాంతిః శాంతిః శాంతిః.

(సత్యపథము : బసంత్ సంచిక :1998 : 5-2)